క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



దుత్తలూరు: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. తహసీల్దార్ యనమల నాగరాజు, ఎంపీడీఓ హనుమంతరావు, డిప్యూటీ ఎంపీడీఓ మల్లికార్జున, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు మీసాల సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఉదయగిరి రూరల్: మండలంలోని బండగానిపల్లి పంచాయతీ బిజ్జంపల్లికి చెందిన షేక్ నన్నుకు మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి రూ.5వేలు సాయం చేశారు. గత కొంతకాలంగా నన్ను అనారోగ్యంతో బాధపడుతున్న క్రమంలో వైద్యఖర్చుల నిమిత్తం తన ప్రతినిధుల ద్వారా నగదును అందజేశారు. దీంతో దాతకు మన్ను కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న జడ్జి

కావలి: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జీ విక్రమ్‌సిన్హా అన్నారు. కావలిలోని సబ్‌జైలులో మంగళవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు జడ్జి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఖైదీలు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పించే ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలన్నారు. తొలుత జైలులో కల్పిస్తున్న సౌకర్యాలను ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. లీగల్ ఎయిడ్ మెంబర్ సాయిప్రసాద్, జైలు సూపరింటెండెంట్ చిన్నసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

మర్రిపాడు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గంగవరపు లక్ష్మీదేవి అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. తొలుత అధికారుల శాఖలవారీగా ప్రగతిని చదివి వినిపించారు. అనంతరం మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు పారిశుద్ధ్యం, ఉపాధ్యాయుల కొరత, రోడ్ల సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని మండలాధికారులు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ విజయభాస్కర్, ప్రజాప్రతినిధులు, మండలాధికారులు పాల్గొన్నారు.

పంచతంత్ర కథలతో నైతిక విలువలు



సోమశిల: నీతి కథలు చదువుతున్న చిన్నారులు

సోమశిల: ప్రముఖ కవి పరావస్తు చిన్నయ్యసూరి రచించిన పంచతంత్రంలోని నీతి కథలు చిన్నారుల్లో నైతిక విలువలను పెంపొందిస్తాయని గ్రంథాలయాధికారి నారాయణ అన్నారు. అనంతసాగరంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా రెండోరోజు మంగళవారం ఆయన విద్యార్థులకు కోతి పిల్ల చేష్టలు కథ ద్వారా అనవసరమైన పనుల్లో జోక్యం చేసుకోవడం వల్ల కలిగే నష్టాన్ని తెలియజేశారు. అనంతరం సచివాలయం-1 సంక్షేమ, విద్యా సహాయకులు బీ మురళి అక్షరాలు, అంకెలతో సులభ చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.

వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం

అనుమసముద్రంపేట: స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. తొలిరోజు 20 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి శ్రీనివాసరాజు మాట్లాడుతూ పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. నాణేల సేకరణ కర్త ఎండీ వాయిజ్ పాల్గొన్నారు.

మధుర ఫలం.. విషతుల్యం

రసాయనాలతో మగ్గుతున్న మామిడి

- విచ్చలవిడిగా నిషేధిత కార్బైడ్ వినియోగం
- ప్రజారోగ్యంతో వ్యాపారుల చెలగాటం
- పట్టించుకోని అధికారులు



కార్బైడ్‌తో మగ్గబెట్టడంతో పచ్చగా నిగనిగలాడుతున్న మామిడి పండ్లు



పట్టణంలోని ఒక దుకాణంలో విక్రయిస్తున్న మామిడి పండ్లు

కావలి/ బిట్రగుంట: కావలి పట్టణాన్ని కార్బైడ్‌తో మగ్గబెట్టిన మామిడి పండ్లు ముంచెత్తుతున్నాయి. సీజన్ ప్రారంభం నుంచే పక్వానికి రాని కాయలను కృత్రిమ పద్ధతుల్లో మగ్గించి దుకాణాల్లో విక్రయిస్తున్నారు. ప్రధానంగా బంగినపల్లి, చెరుకురసాలు, అంటు మామిడి, తదితర రకాలను పక్వానికి రాక ముందే కోసి కార్బైడ్‌తో మగ్గబెట్టి మార్కెట్‌కు తరలిస్తున్నారు. కృత్రిమ పద్ధతుల్లో పండించిన పసుపు వర్ణంలో నిగనిగలాడే మామిడి పండ్లను రకాన్ని బట్టి కిలో రూ.100 నుంచి రూ.150 వరకు అమ్ముతున్నారు. కార్బైడ్‌తో మగ్గించిన పండ్లను తింటే పలు అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉన్నా వ్యాపారులు పట్టించుకోవడం లేదు. మామిడిపళ్ల సీజన్‌ను సొమ్ము చేసేకునేందుకు ఇష్టారాజ్యంగా విక్రయాలు చేస్తూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ఈదురుగాలులు, పడమటి గాలులకు రాలిన కాయలను కార్బైడ్ ద్వారా ఒక్కరోజులోనే మగ్గబెట్టి పట్టణంలోని ట్రంక్‌రోడ్డు, జాతీయ రహదారి పక్కన తాత్కాలికంగా ఏర్పాటు చేసిన దుకాణాల్లో విక్రయిస్తున్నారు. రసాయనాలతో మగ్గబెట్టిన విషయం తెలియని ప్రజలు ఇష్టంగా కొనుగోలు చేసి ఇబ్బందులు పడుతున్నారు.

కాపు రాకున్నా...

కావలి పట్టణానికి జిల్లాతో పాటు ప్రకాశం జిల్లా నుంచి మామిడి పండ్లు వస్తుంటాయి. ఈ దఫా జిల్లాతో పాటు సమీపంలోని ప్రకాశం జిల్లాలో కూడా మామిడి కాపు బాగా తగ్గిపోయింది. వాతావరణంలోని మార్పులు, తెగుళ్ల కారణంగా గతంతో పోలిస్తే మామిడి దిగుబడి గణనీయంగా పడిపోయింది. తోటల్లో ఉన్న కాయలు కూడా ఇంకా పక్వానికి రాని దశలోనే ఉన్నాయి. అయితే వ్యాపారులు మాత్రం రోడ్లపైన పసుపుపచ్చటి రంగులో నిగనిగలాడుతున్న మామిడి కాయలను రాశులు పోసి విక్రయిస్తున్నారు. వాటిని కోసి చూస్తే మాత్రం లోపల తెల్లగా, గట్టిగా ఉంటున్నాయి. ఈ కాయలను తింటే రుచిగా లేకపోవడంతో పాటు తిన్న కొద్దిసేపటికే నాలుక, పెదవులపైన మంట, దురద వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. ఇతర జిల్లాల నుంచి పక్వానికి రాని కాయలు తీసుకొచ్చి రసాయనాలతో మగ్గబెట్టి విక్రయిస్తుండడంతో వాటిని తిన్న వారు ఇబ్బంది పడుతున్నారు.

కార్బైడ్ వాడకాన్ని నిషేధించినా...

కృత్రిమ పద్ధతుల్లో కాల్షియం కార్బైడ్‌ను వినియోగించి పండ్లను మగ్గబెట్టడాన్ని ప్రభుత్వం నిషేధించినా వ్యాపారులు లెక్క చేయడం లేదు. ఇతర పద్ధతులతో పోలిస్తే అతితక్కువ ఖర్చుతో, ఒక్కరోజులోనే కార్బైడ్ ద్వారా పండ్లను మగ్గబెట్టే అవకాశం ఉండటంతో విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. కార్బైడ్ ద్వారా మగ్గించిన పండ్లను తింటే నోటిపూత, చర్మం ఎర్రబారడం, కళ్లు పొడిబారడం, నీరసం, వాంతులు, తదితర సమస్యలు వస్తున్నా లెక్కచేయడం లేదు. చిన్నపిల్లల్లో సమస్య తీవ్రత మరింత అధికంగా ఉండే అవకాశం కూడా ఉంది. ప్రజారోగ్యానికి ప్రమాదకరమైన కార్బైడ్ వినియోగాన్ని అరికట్టే విషయంలో సంబంధిత అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో వ్యాపారులు విచ్చలవిడిగా రసాయనాలు వినియోగిస్తున్నారు. మామిడితో పాటు సపోటా, అరటి పండ్లను మగ్గబెట్టేందుకు కూడా కార్బైడ్‌ను వినియోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి కార్బైడ్ వినియోగంపై నిఘా ఉంచాలని వినియోగదారులు కోరుతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

వేసవి రాగానే అందరికీ గుర్తొచ్చేది మామిడి పండ్లు. ప్రతి ఒక్కరూ ఎంతో ఇష్టంగా తింటారు. కానీ మనం తినే మామిడి పండ్లు సహజంగా పండాయా లేక రసాయనాలతో మగ్గబెట్టినవా అనే విషయాన్ని పరిశీలించాలి. మార్కెట్లో ఎక్కువగా మగ్గబెట్టిన పండ్లే కనిపిస్తున్నాయి. ఇవి ఆరోగ్యానికి హానికరం. సహజంగా పండిన పండ్లను ఎంచుకోవడం చాలా ముఖ్యం. సహజంగా పండినవి కొద్దిగా గట్టిగా ఉండి వేర్వేరు రంగుల్లో కనిపిస్తాయి. మంచి సువాసన వస్తాయి. రసాయనాలతో మగ్గబెట్టినవి ఎక్కువగా మెత్తగా ఉంటాయి. రసాయనాలతో మగ్గబెట్టినవి పూర్తిగా ఒకే రంగులో మెరిసిపోతూ ఆకర్షణీయంగా కనిపిస్తాయి. వాసన ఉండవు. ఈ తేడాలను గమనించి సహజంగా పండిన మామిడి పండ్లను మాత్రమే తినాలి. కృత్రిమంగా మగ్గబెట్టినవి తింటే జీర్ణ సంబంధిత సమస్యలు, పొట్ట ఉబ్బరం, అసహజమైన కడుపు నొప్పి వంటివి రావచ్చు. అందుకే మామిడి పండ్లు తినేటప్పుడు ఆరోగ్యకరమైనవి ఎంచుకోవడం మంచిదని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

ఎథిలిన్ సాచెట్స్‌కు ప్రభుత్వం అనుమతి ఉంది

మామిడి పండ్లు రంగు మారడానికి ఎథిలిన్ సాచెట్స్‌ను వినియోగించుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వీటితో 24 గంటల్లోనే మామిడి పండ్లు రంగు మారుతాయి. కార్బైడ్ రసాయనాన్ని వినియోగించ కూడదు. వాడితే చర్యలు తీసుకుంటాం.

–జీ వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, నెల్లూరు జిల్లా

సీఎం వస్తున్నారని..

- నారంపేట ఏపీఐఐసీ సెజ్‌కు ముస్తాబు



సెజ్‌లోని కల్వర్టుకు రంగువేసి సైడ్‌డ్రెయిన్ల పక్కన మట్టితోలి చదును చేసిన దృశ్యం

ఆత్మకూరురూరల్: మండలంలోని నారంపేట ఏపీఐఐసీ సెజ్‌ను అధికారులు ముస్తాబు చేస్తున్నారు. ఆత్మకూరులో మే 1న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటించనున్న నేపథ్యంలో సెజ్‌లో అధికారులు, అధికార పార్టీ నాయకులు చేస్తున్న హడావిడి చూపరులను విస్తుగొలుపుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోపే టీడీపీ నాయకులు సెజ్‌లోని 40 ఎకరాల్లోని లక్షలాది రూపాయల విలువచేసే జామాయిల్ చెట్లను తెగనరికి స్వాహా చేశారు. ఆ సమయంలో పట్టించుకోని ఏపీఐఐసీ అధికారులు సీఎం వస్తున్నారని సెజ్‌లో హడావిడిగా చేస్తున్న పనులు ఆ మార్గాన రాకపోకలు సాగించే వాహనదారులకు అనేక ప్రశ్నలకు వేదికగా మారాయి. కాగా మంగళవారం ఏపీఐఐసీ జోనల్ మేనేజరు శివకుమార్, డిప్యూటీ జోనల్ మేనేజరు శేఖర్‌రెడ్డితో సహా సంబంధిత అధికారులు పారిశ్రామికవాడలో తిష్ట వేసి యంత్రాలతో మట్టి పనులు చేపట్టారు. అలాగే కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని, తదితరులు పారిశ్రామికవాడను పరిశీలించి సీఎం పర్యటనకు సంబంధించి సూచనలు చేశా రు. వారి వెంట పరిశ్రమల శాఖ జీఎం మారుతి ప్రసాద్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ గంగాధర్, విద్యుత్ శాఖ ఎస్‌ఈ విజయన్, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, తదితరులు ఉన్నారు.



సెజ్‌ను పరిశీలించి సూచనలు చేస్తున్న కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్

పక్కాగృహాలను త్వరితగతిన పూర్తిచేయాలి



ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షిస్తున్న ఈఈ మోహన్‌రావు

ఉదయగిరిరూరల్: పక్కాగృహాల లబ్ధిదారులు నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ మోహన్‌రావు అన్నారు. స్థానిక హౌసింగ్ డీఈఈ కార్యాలయంలో డీఈఈ, ఏఈలు, ఇంజనీరింగ్ సహాయకులతో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కాగృహ నిర్మాణాలను పూర్తి చేసుకోలేని వారికి ప్రభుత్వం అదనపు నగదు సాయాన్ని అందజేస్తోందని తెలిపారు. మండలంలో 104 మందికి అదనపు సాయాన్ని అందజేయగా, 12 మంది మాత్రమే నిర్మాణాలను ప్రారంభించడంపై అసహనం వ్యక్తం చేశారు. లబ్ధిదారులు త్వరితగతిన గృహ నిర్మాణాలను పూర్తిచేసేలా చైతన్యపర్చాలని సిబ్బందికి సూచించారు. కొండాయపాళెం లేఅవుట్‌లో ఆప్షన్-3 కింద కాంట్రాక్టర్ చేపట్టిన గృహ నిర్మాణ పనులు గురువారం నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. వారికి కూడా ప్రభుత్వం రూ.50 వేలు అదనపు నగదు చెల్లిస్తుందన్నారు. ఈ సమావేశంలో డీఈఈ పీరాన్, ఏఈ రామకృష్ణ వర్క్‌ఇన్‌స్పెక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కార్మిక, కర్షక సమ్మె జయప్రదానికి పిలుపు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

ఉదయగిరి రూరల్: దేశవ్యాప్తంగా సీపీఎం ఆధ్వర్యంలో మే 20వ తేదీ చేపడుతున్న కార్మిక, కర్షక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కే అజయ్‌కుమార్ కోరారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సీపీఎం, సీఐటీయూ నాయకులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పనితీరుతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, నాలుగు లేబర్‌కోడ్లను రద్దు చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా కార్మిక, కర్షక సంఘాలు సమ్మెను చేపడుతున్నట్లు తెలిపారు. సీపీఎం నాయకులు గ్రామాల్లో పర్యటించి సమ్మెలో పాల్గొని జయప్రదం చేసేలా ప్రజలను చైతన్యవంతం చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, కోడె రమణయ్య, వెంకటేశ్వర్లు, నాయబ్, ఎంపీటీసీ కాకు విజయమ్మ, కామాక్షమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌కు దామిశెట్టి ఎనలేని సహకారం



దామిశెట్టికి నివాళులర్పిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

కావలి: దామిశెట్టి శ్రీనివాసులునాయుడు రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాలకు ఎనలేని సహకారాన్ని అందించారని కావలి రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు బెజవాడ రవి కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని రెడ్‌క్రాస్ భవనంలో రెడ్‌క్రాస్ జీవిత పోషక సభ్యులు, వాక్సిన్ సెంటర్ దాత దామిశెట్టి శ్రీనివాసులునాయుడు సంతాప సభను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ దామిశెట్టి శ్రీనివాసులునాయుడు కష్టపడి చిన్న స్థాయి నుంచి పారిశ్రామికవేత్తగా ఎదిగారని, కావలిలో రైస్‌మిల్లులు, ఆయిల్ మిల్లులు ఏర్పాటు చేసి పలువురికి ఉపాధి కల్పించారని తెలిపారు. ఇంజనీరింగ్ కళాశాలను స్థాపించి పలువురు పేద విద్యార్థులకు విద్యాదానం చేశారన్నారు. రెడ్‌క్రాస్ పోషక సభ్యత్వాన్ని స్వీకరించి తల్లిదండ్రుల పేరుతో వాక్సిన్ సెంటర్ ఏర్పాటుకు సహకరించారని వివరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ పోషక సభ్యులు, విశ్రాంత హెచ్‌ఎం బుర్ల రఘుకుమార్‌రెడ్డి, చిన్నపిల్లల డాక్టర్ పామూరు శ్రీధర్, కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డీ రవిప్రకాష్, జేవీవీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు, గాదిరెడ్డి మురళీకృష్ణ తదితరులు శీనయ్యానాయుడితో తమ అనుబంధం, రెడ్‌క్రాస్‌కు ఆయన అందించిన సహకారాన్ని గుర్తుచేశారు. రెడ్‌క్రాస్ బాధ్యులు కలికి శ్రీహరిరెడ్డి, కే హరినారపరెడ్డి, ఓరుగంటి వెంకటేశ్వర్లు, బీఎస్ ప్రసాద్, నల్లిపోగు ప్రణీత్, దామిశెట్టి సురేంద్ర, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి



ఆత్మకూరు డిపో ఎదుట రిలే దీక్ష చేపడుతున్న మహిళా నేతలు



ఉదయగిరిలో..

ఉదయగిరి/ఆత్మకూరురూరల్: ఆర్టీసీ కార్మికులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎన్‌ఎంయూ రీజనల్ మాజీ పబ్లిసిటీ కార్యదర్శి షేక్ సలాం, ఉదయగిరి డిపో ఉపాధ్యక్షుడు శంకర్ డిమాండ్ చేశారు. ఎన్‌ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు చేపడుతున్న రిలేదీక్షలు రెండోరోజైన మంగళవారం కూడా కొనసాగాయి. దీక్షలో కూర్చున్న కార్మికులకు వారు సంఘీభావం తెలిపి మాట్లాడారు. పలుమార్లు కార్మికులు నిరసనలు, ఆందోళనలు, ధర్నాలు చేపట్టినా సమస్యలను పరిష్కరించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సిబ్బందికి పదోన్నతులు కల్పించాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, 1-2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలని, మహిళా కార్మికులకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కాగా ఆత్మకూరు డిపో ఎదుట రెండో రోజు మహిళా ఉద్యోగులు రిలేదీక్ష చేపట్టారు. ఎన్‌ఎంయూ రీజనల్ సభ్యురాలు బీబీ జాన్, ఆత్మకూరు డిపో యూనియన్ నాయకులు నారాయణమ్మ, అంకమ్మ, సులోచన, పార్వతి, కృష్ణవేణి, శారద, లక్ష్మి, ప్రభావతి, ఉదయగిరి నాయకులు బీ నాగరాజు, మునీర్, సూర్యనారాయణ, ఆరిఫ్, శ్రీనివాసులు, ఎం.శ్రీనివాసులు, బాషా పాల్గొన్నారు.

పది విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు

ఉదయగిరిరూరల్: మండలంలో పదో తరగతిలో తప్పిన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ-1 షేక్ మస్తాన్‌వలీ తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గండిపాళెం, ఉదయగిరి, గడ్డంవారిపల్లె, బిజ్జంపల్లె క్లస్టర్ కేంద్రాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. ప్రధానంగా గణితం,సైన్స్ సబ్జెక్టులపై శిక్షణ ఉంటుందని తెలిపారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

ఉదయగిరి: మండలంలోని మాసాయిపేట గ్రామానికి చెందిన రాగి శివకృష్ణ తన భార్య రమ్య కనిపించడం లేదని పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఇటీవల భార్య భర్తల మధ్య వివాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 20వ తేదీ ఓ శుభకార్యానికి వెళ్లిన భార్య తిరిగి ఇంటికి రాలేదని భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కే ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవచూపాలి



పహల్గాం మృతులకు సంతాపం తెలుపుతున్న ఎంపీపీ, అధికారులు

దుత్తలూరు: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపాలని ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. తొలుత ఇటీవల ఉగ్రవాదుల దాడిలో అసువులు బాసిన వారికి సతాపాన్ని తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం మండలాధికారులు శాఖలవారీగా ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రస్తుత ప్రతీకార రాజకీయాలతో అభివృద్ధి కార్యక్రమాల్లో తాను చురుగ్గా పాల్గొనలేకపోతున్నానని తెలిపారు. తన కుటుంబానికి చెందిన గత కొన్ని నెలలుగా మూసివున్న క్రషర్‌పై అధికారులు దాడులు నిర్వహించి జరిమానా విధించడం విడ్డూరంగా ఉందన్నారు. అయినా ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. తహసీల్దార్ యనమల నాగరాజు, ఎంపీడీఓ హనుమంతరావు, డిప్యూటీ ఎంపీడీఓ మల్లికార్జున, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఇసుక లారీల ఓవర్‌లోడ్



పెన్నా నది నుంచి ఇసుకను తరలించే లారీలు, టిప్పర్లు ఓవర్‌లోడ్‌తో వెళ్తున్నాయి. వీటి కారణంగా నెల్లూరుపాళెం-వింజమూరు, సంగం-కలిగిరి రోడ్లతో పాటు కావలి-సీతారామపురం, పామూరు-బద్వేల్ జాతీయ రహదారులు సైతం దెబ్బతింటున్నాయి. మరోవైపు వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యం ఇసుక లారీలు, టిప్పర్లు అధికలోడుతో రేయింబవళ్లు వింజమూరు, కలిగిరి, దుత్తలూరు, వరికుంటపాడు, కొండాపురం పోలీస్‌స్టేషన్ల మీదుగానే వెళ్తున్నాయి. అధికలోడుతో వెళ్లే వాహనాలను నియంత్రించాల్సిన పోలీసులు, రవాణాశాఖ అధికారులు నెలవారీ మామూళ్లు తీసుకుంటూ వాటిపై కన్నెత్తి కూడా చూడకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

–ఉదయగిరి

రికార్డులను పక్కాగా నిర్వహించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ సునీత

ఉదయగిరి: అంగన్‌వాడీలు తమ కేంద్రాలకు సంబంధించిన రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ సునీత సూచించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో అంగన్‌వాడీ సెక్టార్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో సమయాన్ని పాటించాలన్నారు. కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందజేయాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకునిగర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. అర్హులైన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తేజశ్విని, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభించండి

ఉదయగిరి: వేసవిని దృష్టిలో ఉంచుకుని పంచాయతీకార్యదర్శులు మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో చలివేంద్రాలను ప్రారంభించాలని డిప్యూటీ ఎంపీడీఓ కరీముల్లా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు గండిపాళెం, ఉదయగిరి, శకునాలపల్లి పంచాయతీల్లో చలివేంద్రాలను ప్రారంభించారని చెప్పారు. మిగిలిన పంచాయతీల్లోనూ త్వరితగతిన ప్రారంభించాలన్నారు. పన్నులను నూరు శాతం వసూలు చేయాలన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

ఉదయగిరి: వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఏఈలు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ డీ రామకృష్ణారావు అన్నారు. మంగళవారం ఆయన ఉదయగిరిలోని తన కార్యాలయంలో ఉదయగిరి, సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు మండలాల ఏఈలు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని చేతిపంపుల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి మరమ్మతులకు గురైన వాటిని ఉపయోగంలో తీసుకురావాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్డి లేని వారిని గుర్తించి నిర్మించుకునేలా చైతన్యపరచాలని సూచించారు. క్వాలిటీ కంట్రోల్ ఏఈ ఎస్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.